# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **జమ్ము కాశ్మీర్‌లో రేపు జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారు.**

2. **అమరావతి రాజధాని ప్రాంతంలోని నిర్మాణాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పరిశీలిస్తున్నారు.**

**3.** **పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా టి.జి. భరత్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా వి.సుభాష్ ఈరోజు అధికారంగా బాధ్యతలు చేపట్టారు.**

**5.** **రాష్ట్ర శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.**

**6.** **జాతీయ పరీక్ష సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ జాతీయ అర్హత పరీక్ష నెట్ -2024ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.**

===========================

అమరావతి రాజధాని ప్రాంతంలోని నిర్మాణాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పరిశీలిస్తున్నారు. ఈ ఉదయం ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి తొలుత ప్రజావేదికను సందర్శించారు. అనంతరం ఉద్దండరాయునిపాలెంలో రాజధానికి శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. అలాగే రాజధాని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, మంత్రులు, ఎమ్మెల్సీలు, న్యాయాధికారుల గృహ సముదాయాలను పరిశీలించి.. అధికారులను నిర్మాణ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నుంచి రెండు రోజులపాటు జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తారు. ఇందులో భాగంగా జమ్మూకశ్మీర్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈరోజు శ్రీ నగర్‌లో జరిగే యువతకు సాధికారత జమ్ము కశ్మీర్ పరివర్తన కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారు. ప్రభుత్వ సేవలలో ఎంపికైన 2వేల మందికి ఈ సంధర్భంగా నియామక పత్రాలను అందచేస్తారు. రేపు శ్రీనగర్ లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ రోజు వెలగపూడి సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రిగా అధికారికంగా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులపై విస్తృతంగా సమీక్షించి చర్యలు చేపడతామని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తామని తెలుపుతూ,

వాయిస్ (20 సెకన్లు)

---------------------------

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రిగా టి.జి. భరత్ బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలు దస్త్రాలపై ఆయన సంతకాలు చేశారు. ఈ సందర్భంగా టి.జి. భరత్ మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తూ, సులభతర వాణిజ్యంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతామని పేర్కొన్నారు.

మరోవైపు రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, వైద్య బీమా సేవల శాఖ మంత్రిగా వి.సుభాష్ ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడి సచివాలయంలో దస్త్రాలపై సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్మిక భీమా పథకం కింద భీమా నగదును త్వరతిగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ ఎస్.నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. వెలగపూడిలోని రాష్ట్ర శాసనసభలో రెండు రోజుల పాటు సమావేశాలు జరగనున్నాయి. తొలిరోజు సమావేశాలకు ప్రొటెం శాసనసభాపతిగా తెలుగుదేశం పార్టీకి చెందిన రాజమండ్రి గ్రామీణ శాసనసభ సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిని గవర్నర్ నియమించారు. ఈ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

---------------------------

ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవాలని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈరోజు అనంతపురం నగరంలో ఆయుష్ శాఖ తోపాటు వివిధ యోగా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా శారీరక బలంతో పాటు మానసికంగా కూడా బలంగా ఉంటారని పేర్కొంటూ,

వాయిస్ (29 సెకన్లు)

---------------------------

జాతీయ పరీక్ష సంస్థ -ఎన్‌టీఏ దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ జాతీయ అర్హత పరీక్ష నెట్ -2024 పరీక్షను ప్రభుత్వం రద్దు చేసింది. యూజీసీ నెట్ పరీక్షలో అవకతవకలు జరిగినట్టు ప్రభుత్వం నిర్ధారణకు రావడంతో పరీక్షల్లో పారదర్శకత, విశ్వసనీయత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర విద్యాశాఖ తెలిపింది. త్వరలో

పరీక్ష తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. పరీక్షల ప్రక్రియలో జరిగిన అవకతవకలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నామని తెలిపింది. జూన్ 18వ తేదీన దేశంలోని అనేక నగరాల్లో ఆఫ్‌లైన్ విధానంలో యూజీసీ నెట్ పరీక్ష జరిగింది. దీనిని ఎన్‌టీఏ రెండు విడతల్లో నిర్వహించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం ఈనెల 24న జరగనుంది. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రభుత్వశాఖలకు ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రేపు సాయంత్రం 4 గంటల్లోపు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరగనున్న తొలి మంత్రివర్గ సమావేశం ఇది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత సర్వీసు ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ముఖ్యమంత్రి కార్యదర్శిగా ప్రద్యుమ్నను నియమించారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా శశిభూషణ్ కుమార్, రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్డీఏ) కమిషనర్ గా కె.భాస్కర్ నియమితులయ్యారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ను భూగర్భ వనరుల శాఖ కమిషనర్‌గా నియమించారు. తిరుపతి జాయింట్ కలెక్టర్‌కి ఆ జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అనిల్ కుమార్ సింఘాల్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక సీఎస్‌గా బి.రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

యోగా పరిపూర్ణ జీవన విధానమని తిరుపతికి చెందిన యోగా శిక్షకులు డాక్టర్ కె.సరితా బాలాజీ తెలిపారు. తిరుపతిలో ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ అంతర్జాతీయంగా యోగాకి ప్రాధ్యానత పెరుగుతోందని, గత కోనేళ్ళుగా యోగాపై అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. యోగా సాధన వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని తెలుపుతూ,

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

పౌరసరఫరాల వ్యవస్థ పారదర్శకంగా పని చేసేలా చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడ గొల్లపూడిలోని పౌరసరఫరాల గోదామును మంత్రి నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 160 మండల స్థాయి నిల్వ కేంద్రాలను పరిశీలించగా 68 చోట్ల సరకులో అవకతవకలు గుర్తించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని గోదాములో ఆరు సరకుల్లో ఐదు నాణ్యత, సరైన తూకం లేనట్లు గుర్తించినట్లు తెలిపారు. పౌరసరఫరాల శాఖలో గోదాముల వద్ద సరకుల వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలు అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానం –టీటీడీ కార్యనిర్వహణాధికారి  జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం భవనంలో టీటీడీ అన్నప్రసాద విభాగం అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,  తాత్కాలికంగా నిలిపివేసిన పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. భక్తులకు అందజేస్తున్న మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే స్థలం పరిశుభ్రంగా, ఉంచాలని సూచించారు. ఆహార నాణ్యత అధికారులు  ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు.

---------------------------

రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డీజీపీగా సీహెచ్ ద్వారకా తిరుమలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా ఉన్న తిరుమలరావును పోలీసు దళాల అధిపతిగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ గత రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

=======================